క్లుప్తంగా

పీవీ ఆచారికి నివాళి

కారెంపూడి: ఊరికి ఉపకారిగా పేరుగాంచిన డాక్టర్ పాలపర్తి వేంకటాచారి (పీవీ ఆచారి) 77వ జయంతి సందర్భంగా గ్రామస్తులు బుధవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్థానిక వీరాంజనేయస్వామి ఆలయంలో బుధవారం 500 మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కారెంపూడి వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆచారి భార్య దుర్గమ్మ కుమారులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఆర్‌ఐగా రామకృష్ణ



రెంటచింతల: మండల ఇన్‌చార్జి ఆర్‌ఐగా పల్లా రామకృష్ణను నియమిస్తూ తహసీల్దార్ కె.కరుణ కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రామకృష్ణ ప్రస్తుతం పాలువాయి గ్రామ వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వివిధ పనులపై తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

30 రేషన్ బియ్యం బస్తాలు స్వాధీనం

పిడుగురాళ్ల: అక్రమంగా తరలిస్తున్న 30 రేషన్ బియ్యం బస్తాలు పిడుగురాళ్ల పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. దాచేపల్లికి చెందిన కొప్పుల వెంకటేశ్వర్లు పిడుగురాళ్ల మండలంలోని తుమ్మల చెరువు గ్రామంలో ఈర్లదేవి వద్ద నుంచి 30 రేషన్ బియ్యం బస్తాలు కొనుగోలు చేసి, వాహనంలో లోడు చేసుకుని తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న పట్టణ ఎస్సై ఎం.మోహన్ అడ్డుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసుకుని, వాహనం, 30 బియ్యం బస్తాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

భారత్ కిసాన్ యూనియన్ ర్యాలీ



దాచేపల్లి : విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కాంగ్రెస్ భారత్ కిసాన్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. నారాయణపురం ఆర్‌అండ్‌బీ బంగ్లా సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. కిసాన్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరాలపాటి జానీ మాట్లాడుతూ.. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని నినదించారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేస్తే చూస్తూ ఊరుకోబోమని, ఈ అంశాన్ని కేంద్రం ఉపసంహరించుకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు



దాచేపల్లి: తంగెడ గ్రామ సమీపంలోని కృష్ణానది అవతలి ఒడ్డున వేంచేసి ఉన్న శ్రీలక్ష్మీ నరసింహస్వామికి పవిత్రోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. పవిత్రోత్సవాల్లో భాగంగా స్వామికి త్రయాహ్నిక దీక్షగా వైఖానస శాస్త్రం ప్రకారం దేవోత్థాపన, ఆరాధన అష్టోత్తర శతకలశ పూజలు నిర్వహించారు. మంత్రం పుష్పాలను స్వామికి ఆలయ అర్చకులు, పూజారులు సమర్పించారు. ప్రతిరోజూ స్వామి దేవాలయంలో జరిగే పూజలు అర్చనలు ప్రత్యేక ఆరాధనలలో ఏదైనా లోపాలు జరిగితే దోషాలు తొలగిపోయేందుకు ఈ పూజలు నిర్వహిస్తారని అర్చకులు చెప్పారు. పూజల్లో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, కార్యనిర్వాహణధికారి సిరికొండ నవీన్, అర్చకులు, పూజారులు పాల్గొన్నారు.

గాంధీ గుడి ప్రారంభం



నరసరావుపేట: మహాత్మాగాంధీ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు మోరా భూపాల్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి సోద రులు స్థానిక ప్రకాష్‌నగర్‌లోని లైట్‌హౌస్ ముందు నిర్మించిన గాంధీ గుడిని బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహాత్ముని ఆశయాలు నేటి యువతరం మర్చిపోతోందన్నారు. వారికి గాంధీ అంటే రాహుల్ గాంధీ, సోనియాగాంధీ మాత్రమే గుర్తుకు వస్తారన్నారు. రిటైర్డు ఐఆర్‌ఎస్ అధికారి భూపాల్‌రెడ్డి సోదరులు మహాత్ముని జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని గాంధీకి ఒక దేవాలయం నిర్మించినందుకు అభినందించారు. ప్రతి ఒక్కరూ సత్యం, అహింస మార్గాలతో పాటు మద్యపాన నిషేధం, మాంసం ముట్టకుండా ఉండటం, సర్వమత సమానత్వంతో అందరూ కలిసి గ్రామ స్వరాజ్యం సాధించాలని, దేశంతోపాటు మన రాష్ట్రం కూడా అభివృద్ధి చెందేందుకు కృషిచేయాలని పిలుపు ఇచ్చారు. సర్వమత ప్రార్థనల అనంతరం పేదలకు వస్త్రదానం చేశారు.

గాంధీ శాంతిమార్గం స్ఫూర్తిదాయకం



పిడుగురాళ్ల టీడీపీ కార్యాలయంలో మహాత్మ గాంధి జయంతిని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని,



పిడుగురాళ్ల మదీనా వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేస్తున్న దృశ్యం



మాచర్లలో గాంధీ విగ్రహం వద్ద నివాళి



మాచవరం గ్రామ సచివాలయం వద్ద..

పిడుగురాళ్ల/మాచర్ల/దాచేపల్లి/మాచర్ల రూరల్/మాచవరం/రెంటచింతల/కారెంపూడి/గురజాల/గురజాల రూరల్: గాంధీ బోధించిన శాంతి మార్గం స్ఫూర్తిదాయకమని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం గాంధీ జయంత్యుత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

- పిడుగురాళ్ల వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద, ఐలాండ్ సెంటర్ వద్ద ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి పిడుగురాళ్ల రోటరీ క్లబ్ ఆఫ్ లైమ్ సిటీ పిడుగురాళ్ల వారి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు గుండా అశోక్‌బాబు, సెక్రటరీ నీరుమళ్ల రాజేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.
- మదీనా వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. బుధవారం నకరికల్లు మండలం గుండ్లపల్లి గ్రామ ఎంప్లాయిస్ హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంఘ గౌరవ సలహాదారులు గుత్తికొండ మహబూబ్ సుభాని తల్లిదండ్రులు గుత్తికొండ మీరా సాహెబ్, మస్తాన్‌బి జ్ఞాపకార్థం వృద్ధులకు అన్నదానం చేశారు.
- మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ సిబ్బంది గాంధీ జయంత్యుత్సవం నిర్వహించారు.
- పిడుగురాళ్ల ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్ద మహాత్మా గాంధీ కాంస్య విగ్రహానికి వైఎస్సార్ సీపీ గురజాల నియోజకవర్గ నాయకులు, పల్నాడు హాస్పిటల్ అధినేత, చింతలపూడి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యాశాఖ రాష్ట్ర మాజీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామారావు, గాంధీజీ క్యాంస విగ్రహ కమిటీ అధ్యక్షులు జూలకంటి శ్రీనివాసరావు, ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ కోడూరి ప్రసాద్, కౌన్సిలర్లు కుక్కమూడి సుందరరావు, పసుపులేటి ఆనంద్, మాదాల కిరణ్‌కుమార్, ఆర్యవైశ్య నాయకులు ఆలేటి కనకయ్య, మార్కెట్



వెల్దుర్తిలో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ జెడ్పీటీసీ కళ్ళం రామాంజిరెడ్డి

యార్డు మాజీ డైరెక్టర్లు పతంగి అమర్, చల్లగుండ్ల స్వామి, జాషువా, నాయకులు తోటా బుజ్జిబాబు, వల్లంబట్ల నాగేశ్వరరావు, యోగయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

- దాచేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి తహసీల్దార్ వైవీ కుటుంబరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ, కమిషనర్ ఎంవీ అప్పారావు, వైస్ చైర్మన్లు షేక్ మస్తాన్‌బీ, కొమెరబత్తిన అన్నపూర్ణ, కౌన్సిల్ సభ్యులు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- మాచవరం మండలంలోని పలు గ్రామాల్లో గాంధీ జయంత్యుత్సవం అట్టహాసంగా జరిగింది.
- మాచర్లలో గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, కంభంపాటి అనిల్, కేశవ రెడ్డిలు పాల్గొన్నారు.
- మాచర్ల తహసీల్దార్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి తహసీల్దార్ ఎండీ జియా ఉల్ హుక్ పూలమాల వేసి నివాళి అర్పించారు.
- వెల్దుర్తి మండలం శిరిగిరిపాడు సచివాలయంలో మాజీ జెడ్పీటీసీ కళ్లం రామాంజిరెడ్డి గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు.
- రెంటచింతల మండలం సంపద తయారీ కేంద్రంలో, మిట్టగుడిపాడు సచివాలయంలో గాంధీ



రెంటచింతలలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ వైస్ ఎంపీపీ గొంటు సుమంత్



మిట్టగుడిపాడులో గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సర్పంచ్ గొట్టం ప్రమీల గురవారెడ్డి



పిడుగురాళ్లలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత చింతలపూడి అశోక్‌కుమార్



రెంటచింతల పీహెచ్‌సీకి దుప్పట్లు, దిండ్లు బహూకరిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు



గురజాల సబ్ జైలులో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న జడ్జి సత్యనారాయణ



కారెంపూడిలో మహాత్ముని విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, పెద్దలు



గురజాల వైఎస్సార్ సీపీ కార్యాలయంలో..

జయంత్యుత్సవం జరిగింది. కార్యక్రమాల్లో మాజీ వైస్ ఎంపీపీ గొంటు సుమంత్‌రెడ్డి, మిట్టగుడిపాడు గ్రామ సర్పంచ్ గొట్టం ప్రమీల గురవారెడ్డి పాల్గొన్నారు. మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు, వైఆర్‌ఎస్ హైస్కూల్ కరస్పాండెంట్ యేచూరి వెంకట సైదయ్య పీహెచ్‌సీకి దుప్పట్లు, దిండ్లు బహూకరించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ వి.ప్రదీప్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- కారెంపూడి గాంధీ బొమ్మ సెంటర్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. నీటితో శుద్ధి చేసి పూలమాలలు వేసి కొబ్బరి కాయలు కొట్టి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ పెద్దలు పాల్గొన్నారు.
- గురజాల గాంధీ బొమ్మ సెంటర్లో గాంధీ జయంత్యుత్సవం నిర్వహించారు. అలాగే సబ్ జైలులో ఖైదీల సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. సీడీఎం కోర్టు జడ్జి సత్యనారాయణ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జైలర్ సుబ్బారెడ్డి, వైద్యుడు సాయి కర్ణ కుమార్, న్యాయవాదులు ఎం.శ్రీనివాసరెడ్డి, షేక్ జానీబాషలు, ఎస్.బుల్లయ్య, శరమాళ్ల హనుమంతరావు, నెల్లూరి మల్లయ్య, బి.అక్కేశ్వరరావు ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.
- గురజాల వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం గాంధీ జయంత్యుత్సవం జరిగింది. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, పట్టణ కన్వీనర్ కుక్కమూడి అన్నారావు, వీరంరెడ్డి అమరారెడ్డి, వంకాయలపాటి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛ'మైన మనుషులకు అచ్చమైన సన్మానం

ముగిసిన స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాలు

కారెంపూడి/పిడుగురాళ్ల/మాచర్ల: స్వచ్ఛతాహీ సేవా పక్షోత్సవాలు బుధవారం ముగిశాయి. మహాత్మా గాంధీ జయంతిని అన్ని గ్రామ పంచాయతీలలో బుధవారం నిర్వహించారు. కారెంపూడి గ్రామ పంచాయతీలో ఇన్‌చార్జి సర్పంచ్ బాణావతు సరస్వతీభాయి మహాత్ముని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వచ్ఛతాహీ సేవ పక్షోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లు నిర్వహిస్తున్న క్లాప్ మిత్రాలను సర్పంచ్‌ల ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించారు.

- పిడుగురాళ్ల మున్సిపల్ కార్యాలయంలోనూ బుధవారం పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. కార్యక్రమంలో కమిషనర్ పర్వతనేని శ్రీధర్ పాల్గొన్నారు. అంతకుముందు స్వచ్ఛతా హీ పక్షోత్సవాల సందర్భంగా మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో చెత్త తీసి శుభ్రం చేయించారు. ఆయన కూడా స్వయంగా చీపురు పట్టి శుభ్రం చేశారు.
- మాచర్ల పట్టణం నుంచి 48 మంది పారిశుద్ధ్య కార్మికులు విజయవాడ వెళ్లి వరద ప్రభావిత ప్రాంతాల్లో సేవలందించారని మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు అన్నారు. స్వచ్ఛతా హీ పక్షోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో 48 మంది కార్మికులను ప్రత్యేకంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావు, ఏఈలు గౌతమి, ఆదిత్య, కౌన్సిలర్లు కోటిరెడ్డి, మదార్‌సాహెబ్ పాల్గొన్నారు.



మాచర్లలో పారిశుద్ధ్య కార్మికులను సత్కరిస్తున్న దృశ్యం



పారిశుద్ధ్య కార్మికులను సన్మానించిన మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్



క్లాప్ మిత్రాలను సన్మానిస్తున్న ఇన్‌చార్జి సర్పంచ్, తదితరులు



పిడుగురాళ్ల మున్సిపల్ కార్యాలయ ఆవరణాన్ని చీపురుతో శుభ్రం చేస్తున్న కమిషనర్

న్యాయం చేయండి

- కట్టుకున్న భార్యే కడతేర్చింది
- పోలీస్ స్టేషన్ వద్ద మృతుని బంధువుల ఆందోళన

కారెంపూడి: తమ కుమారుడిని అతని భార్యే పొట్టన పెట్టుకుందని, న్యాయం చేయాలని కోరుతూ మృతదేహంతో తల్లిదండ్రులు, బంధువులు కారెంపూడి పోలీస్ స్టేషన్ వద్ద రోడ్డుపై బుధవారం సాయంత్రం బైఠాయించారు. మండలంలోని పేటసన్నెగండ్ల గ్రామ శివారు సింగరుట్ల తండాకు చెందిన బాణావతు గోపీ నాయక్ అదే తండాకు చెందిన మేనత్త కుమార్తె హనిమీభాయిని ప్రేమ పెళ్లి చేసుకున్నాడు. హనిమీభాయి అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుందని, అతనితోపాటు మరో ముగ్గురి సహకారంతో భర్తను అడ్డు తొలగించుకునేందుకు కుట్ర పన్నిందని బంధువులు ఆరోపిస్తున్నారు. మద్యం అలవాటు ఉన్న భర్తకు కూల్‌డ్రింక్ బాటిల్‌లో గడ్డి నివారణ మందు



స్టేషన్ ముందు ఆందోళన చేస్తున్న మృతుని బంధువులు

స్వల్ప మోతాదులో కలిపి ఇచ్చినట్టు చెబుతున్నారు. గత బుధవారం తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో గుంటూరులోని ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించామని, చికిత్స పొందుతూ గోపీ నాయక్ మంగళవారం రాత్రి మృతి చెందాడని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్టేషన్ వద్ద నిలిపి ఆందోళన చేశారు. నిందితులను ఇంకా ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. సీఐ టీవీ శ్రీనివాసరావు, ఎస్ఐ వాసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, విచారణ అనంతరం నిందితులను అరెస్టు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళన విరమించారు.

అక్కా బావ క్షమించండి..

- నార్నెపాడు వీఆర్వో సూసైడ్ నోట్ లభ్యం
- దర్యాప్తు ముమ్మరం

ముప్పాళ్ల: మండలంలోని నార్నెపాడు వీఆర్వో సత్తెనపల్లి మల్లికార్జునరావు అదృశ్యంపై పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. ఆచూకీ కోసం బృందాలుగా దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వి.సోమేశ్వరరావు తెలిపారు. సమాచారం మేరకు మల్లికార్జునరావు ఆఖరిగా ఉన్న ప్రదేశం నార్నెపాడు గ్రామంలోని డంపింగ్‌యార్డు వద్ద పరిశీలించగా.. 'నా చావుకు ఎవరూ కారణం కాదు' అంటూ మల్లికార్జునరావు రాసినట్లుగా ఉన్న సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 'ఇల్లు నరకంలా మారిపోయింది, మానసిక ఒత్తిడి తట్టుకోలేక చనిపోవాలని నిర్ణయించుకున్నా. ఎన్నో కలలు కన్నాను కాని, ఆర్థిక పరిస్థితులు చావుకు కారణం కాకపోయినా...ఇంట్లో ఉండే అర్హత నాకు లేదు. అక్కా... బావా నన్ను క్షమించండి. నా వల్ల



వీఆర్వో రాసిన సూసైడ్ నోట్

కావడం లేదు. ఇంట్లో వాళ్ల అనందం కోసం పెళ్లి చేసుకున్నా కానీ, అది నా మనసుకి ఎక్కడం లేదు. క్షమించరాని తప్పు చేశాను.' అంటూ ఆ లేఖలో రాసి ఉంది. అందులోని అంశాలను క్షుణ్ణంగా పోలీసులు పరిశీలిస్తున్నారు.

రెండు కుటుంబాల మధ్య ఘర్షణ

పలువురికి గాయాలు

గురజాల రూరల్ : రెండు కుటుంబాల మధ్య ఘర్షణ జరిగి పలువురికి గాయాలైన ఘటన మండలంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గోగులపాడు గ్రామంలో బుధవారం సాయంత్రం ఇంజమూరి రత్తయ్య, ఇంజమూరి సిపాయి కుటుంబాల్లోని ఇద్దరి మహిళల మధ్య రేగిన చిరు వాగ్వాదం చిలికిచిలికి గాలివానై ఘర్షణకు దారి తీసింది. ఇరు కుటుంబాలు కర్రలు, రాడ్లతో పరస్పరం దాడికి దిగారు. దాడిలో ఇంజమూరి సిపాయి, ఇంజమూరి అజయ్‌లకు తీవ్రగాయాలయ్యాయి. ఇంజమూరి నాగభూషణంకు చిన్న గాయమైంది. క్షతగాత్రులను బంధువులు గురజాలలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. విషయం తెలుసుకున్న సీఐ పి.భాస్కర్‌రావు, ఎస్ఐ వినోద్‌కుమార్ వైద్యశాల వద్దకు చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు



తలకు గాయమైన ఇంజమూరి సిపాయి



వైద్యశాలలో చికిత్స పొందుతున్న అజయ్

ఈదురు గాలులకు నేలకొరిగిన చెట్లు

ఇరుకుపాలెం(ముప్పాళ్ల): మండలంలోని ఇరుకుపాలెం మదర్సా వద్ద ఈదురు గాలులతో పాటుగా కురిసిన వర్షానికి రహదారి వెంబడి భారీ వృక్షాలు నేలకొరిగాయి. నరసరావుపేట–సత్తెనపల్లి ప్రధాన రహదారి కావటంత రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న ఎస్సై వి.సోమేశ్వరరావు సిబ్బందితో పాటుగా జేసీబీ, ట్రాక్టర్ల సాయంతో రోడ్డుపై పడిన చెట్లను తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు. వాహనదారులు, ప్రయాణికులు కొద్దిసేపు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



మదర్సా వద్ద చెట్లను తొలగింపును పరిశీలిస్తున్న ఎస్సై సోమేశ్వరరావు

నల్లమల మైదాన ప్రాంతాల్లో విత్తన బంతులు



కారెంపూడి: స్థానిక బ్రహ్మనాయుడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు తయారు చేసిన సుమారు 5 వేల విత్తన బంతులు (సీడ్ బాల్స్)ను కారెంపూడి సమీపంలోని నల్లమల రిజర్వ్ ఫారెస్ట్ మైదాన ప్రాంతాలలో బుధవారం చల్లారు. పర్యావరణవేత్త కొమెర అంకారావు (జాజి), వాసవీ క్లబ్ ప్రతినిధులు భవిరిశెట్టి రామారావు, కర్నాటి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంలో నాణ్యతా లోపాలు



నాదెండ్ల: అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పంపిణీ చేస్తున్న పౌష్టికాహారంలో నాణ్యతా లోపాలు తలెత్తుతున్నాయి. నాదెండ్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 287 అంగన్‌వాడీ కేంద్రాలుండగా, ప్రతి నెలా లబ్ధిదారులకు డ్రైరేషన్ పంపిణీ చేస్తుంటారు. బియ్యం, బెల్లం, పాలు, రాగిపిండి, చిక్కీలతో పాటూ ప్రతినెలా 24 కోడిగుడ్లు అందిస్తుంటారు.అయితే కోడిగ్రుడ్లు చాలావరకూ మురిగిపోతున్నాయని లబ్ధిదారులు వాపోతున్నారు. ఎక్కువ రోజులు నిల్వ ఉన్న కోడిగ్రుడ్లు ఇస్తున్నారని, 24 కోడిగుడ్లలో సగానికి పైగా పాడౌతున్నాయంటున్నారు. గుడ్ల లోపల నల్లని బూజు, దుర్వాసన వస్తోందన్నారు. అంతేకాక బాగా చిన్నసైజులో ఉన్న గ్రుడ్లు ఇస్తున్నారని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కోడిగ్రుడ్లు సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని నాణ్యమైన కోడిగ్రుడ్లు అందించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.